క్లుప్తంగా

తాటిచెట్లు నరికిన ఆరుగురిపై కేసు నమోదు



ఐనవోలు : తాటిచెట్లను నరికిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తమ సొసైటీ తాటిచెట్లను నరికినట్లు మండలంలోని పంథిని గ్రామానికి చెందిన గౌడ సంఘం సభ్యుడు ఫిర్యాదు చేయగా పోలీసులు మంగళవారం విచారణ చేపట్టారు. సర్వే నంబర్ 120లోని ఉపనంబర్లలోని భూమిలో 122 తాటిచెట్లను నరికినట్లు విచారణలో తేలింది. ఈ క్రమంలో తాటిచెట్లను నరికిన సట్ల యాదగిరి, చిర్ర శ్రీధర్, సట్ల సోమన్న, సమ్మెట శ్రీనివాస్, సమ్మెట సమ్మయ్య, సమ్మెట సాంబమూర్తిలపై కేసు నమోదు చేశారు. విచారణలో ఎక్సైజ్ పోలీసులు శ్రీరాములు, చిరంజీవి, కరుణాకర్ పాల్గొన్నారు.

ఇరువర్గాలపై..

దామెర : పరస్పర దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. ఆత్మకూర్ మండలంలోని గూడెప్పాడ్‌కు చెందిన కీసరి రవీందర్‌రెడ్డి కొంత కాలంగా ఊరుగొండలో నివాసం ఉంటున్నాడు. ఆయన సోమవారం సాయంత్రం ఊరుగొండకు లక్కిడి లక్ష్మారెడ్డితో కలిసి బైక్‌పై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన పొలెపాక అర్జున్, పొలెపాక రోహిత్ చెరువు కట్ట వద్ద దాడి చేశారు. ఈ ఘటనలో రవీందర్‌రెడ్డికి గాయాలయ్యాయి. తనపై అర్జున్, రోహిత్ దాడి చేశారంటూ రవీందర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే పొలెపాక అర్జున్ కారులో స్నేహితులతో కలిసి ఓగ్లాపూర్ వైపునకు వెళ్తుండగా జాతీయ రహదారి సమీపంలో గూడెప్పాడ్‌కు చెందిన కీసరి రాజిరెడ్డితోపాటు మరో ఇద్దరు వచ్చి దాడి చేశారు. అర్జున్ తలకు, చేతులు, కాళ్లపై గాయాలయ్యాయి. ఈ క్రమంలో రోహిత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

ఆత్మకూరు : ఇంట్లోకి అక్రమంగా వచ్చి బెదిరిస్తూ దాడికి పాల్పడ్డ ఘటన మండలంలోని గూడెప్పాడ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై అనిల్ కథనం ప్రకారం.. దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన పోలెపాక అర్జున్, పసరుగొండ గ్రామానికి చెందిన గజ్జి విష్ణు, ఓదెల రాజ్‌కుమార్ మండలంలోని గుడెప్పాడ్ గ్రామానికి చెందిన కీసరి రాజిరెడ్డి ఇంట్లోకి వచ్చి దాడికి పాల్పడ్డారని రాజిరెడ్డి పోలీసులకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనను, తన తల్లిని, కొడుకులను చంపుతామని బెదిరించారని రాజిరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై అనిల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడి మృతి

కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు తోడేటి ఓదెలు (65) వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఎస్సై సతీష్ కథనం ప్రకారం.. ఓదెలు ఈనెల 17న ఇంటి వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి డ్రైనేజీలో పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన ఓదెలును కుటుంబాలు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని సోదరుడి కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఎల్కతుర్తి : హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ నేడు (బుధవారం) మండలానికి రానున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్య గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సూరారం గ్రామంలోని పద్మశాలీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన (భూమిపూజ) చేసి అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్ పాల్గొంటారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

'టీఆర్పీఎస్‌తో సంబంధం లేదు'

శాయంపేట : టీఆర్పీఎస్‌తో తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని టీఆర్పీఎస్ అధ్యక్షుడు రామ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వేముల బాలరాజు, ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, రాష్ట్ర పద్మశాలీ సంఘం ఆమోదం పొందిన ఏకైక సంస్థగా పేర్కొన్నారు. ప్రజలు, పద్మశాలీ కులస్తులు ఈ విషయాన్ని గమనించాలని శ్రీనివాస్, బాలరాజు, శ్రీనివాస్‌రావు కోరారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

● ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పరకాల : బీఆర్‌ఎస్ పార్టీతోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. స్పష్టం చేశారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో దామెర మండలంలోని ముస్త్యాలపల్లి, తక్కళ్లపాడు, ఊరుగొండ, దామెర గ్రామాల ముఖ్యనాయకులతో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పేదల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కట్టుబడి ఉన్నారని చెప్పారు. ప్రత్యేక విజన్‌తో రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలు చేపడుతున్నారని తెలిపారు. స్వరాష్ట్ర ఏర్పాటుకు ముందు, అనంతరం చోటు చేసుకున్న అభివృద్ధిని ప్రజలు గమనించాలని సూచించారు. గత ప్రభుత్వాల పాలనలో విద్యుత్ సరఫరాలో రైతులు పడ్డ ఇబ్బంది అందరికీ తెలిసిందే అన్నారు. స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత వ్యవసాయానికి నిరంతరం ఉచిత విద్యుత్ అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలనలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, రైతుబంధు కన్వీనర్ బిల్లా రమణారెడ్డి, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, పోల కృపాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



పరకాల : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

బీఆర్‌ఎస్‌లో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల చేరిక

దామెర మండల కేంద్రానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 20 మంది నాయకులు స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ధర్మారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

రంజాన్ తోఫాలు పంపిణీ

నడికూడ : మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో పేద ముస్లింలకు ప్రభుత్వం అందించిన రంజాన్ తోఫాలను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. కులమతాలకు అతీతంగా రంజాన్ నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. తదనంతరం గ్రామంలోని కంటి వెలుగు కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి పరిశీలించారు. తదనంతరం మహిళ భవన నిర్మాణ స్థల పరిశీలించి సూచనలు చేశారు. వెంటనే పనులను ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



పరకాల : కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే



నడికూడ : తోఫాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

24 నుంచి 'భట్టి' పాదయాత్ర

ధర్మసాగర్ : 'హాథ్ సే హాథ్ జోడో' యాత్రలో భాగంగా ధర్మసాగర్, వేలేరు మండలాల్లో ఈనెల 24, 25 తేదీల్లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తలపెట్టిన పాదయాత్ర నిర్వహించనున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర కోరారు. ధర్మసాగర్, వేలేరు మండలాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. 24న ధర్మసాగర్ మండలంలోని ధర్మసాగర్, ముప్పారం, నారాయణగిరి, 25న వేలేరు మండలంలోని కమ్మరిపేట, వేలేరు, శాలపల్లి, పీచర గ్రామాల్లో భట్టి విక్రమార్క పాదయాత్ర చేపడతారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ పార్టీలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతోపాటు కాంగ్రెస్ పాలనలో అందించిన సేవలను ప్రజలకు వివరించి చైతన్యవంతం చేసే లక్ష్యంతో 'హాథ్ సే హాథ్ జోడో' కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. పాదయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం ధర్మసాగర్‌లోని సభాస్థలిని పరిశీలించారు. ఏర్పాట్లపై శ్రేణులకు సూచనలు చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు జగదీష్‌రెడ్డి, కీసర దిలీప్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ బొడ్డు లెనిన్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కనకం ప్రవీణ్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జాలిగపు దుర్గయ్య, పీచర ఎంపీటీసీ జల్తారు సంపత్, ఆయా మండలాల నాయకులు గాజ వెంకటేష్, గంగారపు శ్యామ్, కత్తి సంపత్, సద్దాం హుస్సేన్, లక్ష్మణ్‌నాయక్, జోడుముంతల సంపత్, జుర్రు సంపత్, తదితరులు పాల్గొన్నారు.



సభా స్థలిని పరిశీలిస్తున్న సింగపురం ఇందిర

రోడ్డు మీద ధాన్యం ఆరబోయొద్దు

ఆత్మకూరు : రోడ్డు మీద ధాన్యం ఆరబోయొద్దని సీఐ బండారి కుమార్ రైతులను కోరారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్ల మీద ధాన్యం ఆరబోస్తే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల, కల్లాల వద్ద ఆరబెట్టుకోవాలని సూచించారు. రోడ్ల మీద ఆరబోస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సర్పంచ్‌లు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఎస్సైలు ప్రసాద్, అనిల్ పాల్గొన్నారు.

'అసత్య ప్రచారం మానుకోవాలి'

దామెర : కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరినట్టు చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాష్‌రెడ్డి హితవు పలికారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీర్‌ఎస్‌లో చేరినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వెంట వర్కింగ్ ప్రెసిడెంట్ పొలెపాక శ్రీనివాస్, దామెర ఉపసర్పంచ్ హింగె నాగేశ్వర్ రావు, మండల ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, నాయకులు పోచయ్య, నగేష్, రాజకొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే ధ్యేయం

● ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

ఎల్కతుర్తి : పేదలను ఆదుకోవడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ తెలిపారు. భీమదేవరపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన 41 మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. అలాగే 15 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, పేద ముస్లింలకు రంజాన్ సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. స్వరాష్ట్ర ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ దిశగా ఎన్నికల ఎజెండాలో పొందుపర్చిన హామీలను అమలు చేయడంతోపాటు పేదల కోసం ఎవరూ అడగకపోయినా కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, దళితబంధు, తదితర పథకాలు రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తూ అన్ని వర్గాలను ఆదుకుంటున్నారని చెప్పారు. పేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం అందించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నట్టు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని మతాల పేదలకు పండుగల సందర్భంగా నూతన దుస్తులు అందజేస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా ఉందని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పేదలు తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, జెడ్పీటీసీ వంగ రవీందర్, ఎంపీపీ జక్కుల అనిత, తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ భాస్కర్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

'పరకాలలో కాంగ్రెస్ గెలుపు ఖాయం'

నడికూడ : రానున్న ఎన్నికల్లో పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు మహాబలగమై క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, తదితర హామీలను వెంటనే నెరవర్చనున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శనిగరపు సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్న, నాయకులు లింగమూర్తి, సదానందం, దుప్పటి నాగయ్య, లేదల్ల మొగిలి, జోసఫ్, రవి, ప్రతాప్, అనిల్, రాజ్‌కుమార్, చంద్రమౌళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

'కంటి వెలుగు'తో పేదలకు లబ్ధి

● మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత రామకృష్ణ

పరకాల : కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పేదలకు లబ్ధి చేకూరుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 7, 8వ వార్డుల్లోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో స్థానిక కౌన్సిలర్లు నల్లెల జ్యోతి, అడప రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 18 నుంచి 26 వరకు కొనసాగనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 ఏళ్ల వయస్సులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సోదా అనిత

మతసామరస్యానికి ప్రతీక 'ఇఫ్తార్'

శాయంపేట : మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు నిలుస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మదీనా మసీదులో స్థానిక పసర్పంచ్ దైనంపల్లి సుమన్, ఎంపీటీసీ జమున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరై మాట్లాడారు. రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆకాంక్షించారు. తొలుత మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నారాయణరెడ్డిని, ఉపసర్పంచ్‌ను, ఎంపీటీసీని ముస్లిం మత పెద్దలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి నందం, నాయకులు వినుకొండ శంకరాచారి, కరుణ్‌బాబు, కార్తీక్, గణేష్ పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న మత పెద్దలు

కుక్కలు, కోతుల బారి నుంచి కాపాడండి



శాయంపేట : కుక్కలు, కోతుల బారి నుంచి ప్రజలను కాపాడాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తికి మండల కేంద్రంలోని కార్యాలయంలో మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడారు. కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఉప్పు రాజు, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్‌రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు కొడెపాక సంజీవరావు తదితరులున్నారు.

మహాసభ పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ

కమలాపూర్ : ఈనెల 21న హనుమకొండలోని కళ్యాణి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న వడ్డెర మహాసభ పోస్టర్‌ను, కరపత్రాలను మండల కేంద్రంలో మంగళవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం మండల ప్రధాన కార్యదర్శి సంపంగి యాకస్వామి మాట్లాడారు. హక్కుల సాధన కోసం వరంగల్, హనుమకొండ జిల్లాల మహాసభ నిర్వహించనున్నట్టు తెలిపారు. వడ్డెర కులస్తులను షెడ్యూల్ తెగలో చేర్చాలని, వడ్డెర బంధు ప్రకటించి అమలు చేయాలని, ప్రమాదాల్లో మృతి చెందిన వడ్డెర వృత్తిదారులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కాంట్రాక్ట్ పనుల్లో వడ్డెరలకు 20 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ ఇవ్వాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాసభకు వడ్డెర కులస్తులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కస్తూరి ముత్యాలు, కస్తూరి లింగయ్య, నర్సింహులు, దారంగుల గట్టయ్య, సంపంగి వెంకటేష్, పల్లపు కళ్యాణ్ పాల్గొన్నారు.



పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామంలోని బామన్లకుంట సమీపంలో, గాంధీనగర్ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పని చేస్తున్న కూలీలకు కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు మంగళవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ ట్రస్ట్ ప్రతినిధి గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడారు. ట్రస్ట్ ద్వారా సామాజిక సేవలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండుటెండల్లో పని చేస్తున్న కూలీలు ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో తాగునీటి, టెంట్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని, అధికారులను ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వేల్పుల రవీందర్, తాళ్లపెల్లి తులసమ్మ, రాజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ చిదురాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

సామాజిక సేవలకు ప్రాధాన్యం

● లయన్స్ క్లబ్ స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, సంతోష్

ధర్మసాగర్ : సామాజిక సేవలు నిర్వహించడానికి ప్రాధాన్యమిస్తున్నట్టు స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి లయన్స్ క్లబ్‌ల అధ్యక్షులు ఎం.కరుణాకర్‌రెడ్డి, ఐత సంతోష్ తెలిపారు. డాక్టర్ ఆమంచ పావని జన్మదిన సందర్భంగా ఆ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని తాటికాయల గ్రామంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి సాధారణ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వారిలో 23 మందికి షుగర్ ఉన్నట్టు నిర్ధారించి తగు సూచనలు చేశారు. అలాగే 150 మందికి కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించి వారిలో 15 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి, సంతోష్ మాట్లాడారు. పేదలకు వైద్యసేవలు అందించడానికి చొరవ తీసుకుంటున్నట్టు తెలిపారు. లయన్స్ క్లబ్ సేవలను పేదలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పెసరు రమేష్, లయన్స్ క్లబ్‌ల కార్యదర్శులు ఆమంచ మధుసూదన్, జి.అనిల్‌కుమార్, కోశాధికారులు నాయిని విజయ్‌చందర్, బి.సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం

ఎల్కతుర్తి : ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు బీజేపీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో వరికోతలు ప్రారంభమై 10 రోజులు గడచినట్టు తెలిపారు. అయినా ఇప్పటివరకు మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని చెప్పారు. ప్రతీ గింజనూ కొనుగోలు చేస్తామని ఊదరగొడుతున్న రాష్ట్ర ప్రభుత్వం మండలంలో ఇప్పటివరకు ఎక్కడ కూడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. వాతావరణంలో మార్పుల వల్ల రైతుల చేతికందిన ధాన్యం వర్షం పాలయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళనకు గురౌతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, అధికారులు స్పందించి మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి మద్దతు ధర చెల్లించి రైతుల నుంచి ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు ఆడెపు శ్రీవర్ధన్, జనగాని కిష్టయ్య, పెరుకు మధు, కంచర్ల శంకరయ్య, గౌర్రె ఆదామ్, వాంకే రవీందర్, కుడితాటి రమేష్, పాటి భగవాన్, ముష్కె వెంకటేష్, దండ దేవేందర్‌రెడ్డి, అంచనగిరి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలు వినియోగించుకోవాలి

కాజీపేట అర్బన్: సఖి వన్‌స్టాప్ సెంటర్ మహిళలకు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల కౌన్సిలర్ శ్రీదేవి, కేస్‌వర్కర్ వినీల తెలిపారు. హనుమకొండ జిల్లా తరాలపల్లిలో మంగళవారం సఖి సేవలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆపదలోని మహిళలకు, ఆడపిల్ల లకు లీగల్ కౌన్సిలింగ్, వసతి, వైద్య, పోలీసు సేవలందిస్తున్నామని తెలిపారు. ఆపదలోని మహిళలు టోల్‌ఫ్రీ నంబర్ 181 లేదా 0870-2452112 నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో తరాలపల్లి డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జేఎల్‌ఎం నోటిఫికేషన్ విడుదల చేయాలి

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ జూనియర్ లైన్ మెన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. హనుమకొండలో లేఖను విడుదల చేసి తిరునహరి శేషు మాట్లాడుతూ.. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో ఖాళీగా ఉన్న జూనియర్ లైన్ మెన్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడానికి ఆదేశాలు ఇవ్వాలని ఆ లేఖలో కోరినట్లు తెలిపారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు కూడా నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. విద్యుత్ ఉద్యోగులకు ఏడు శాతం ఫిటిమెంట్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న విధంగానే ఖాళీగా ఉన్న జేఎల్‌ఎం పోస్టులకి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.

డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయింపు

ఖిలా వరంగల్: వరంగల్ 41వ డివిజన్ శంభునిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి 3,553 గజాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటికే ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతోపాటు జూనియర్ కళాశాల నిర్వహిస్తుండగా ప్రభుత్వం స్థలం కేటాయింపుతో డిగ్రీ కళాశాల అదే ప్రాంగణానికి వచ్చింది. మొత్తం 4.32 ఎకరాల విస్తీర్ణంలో శంభునిపేట ఉన్నత పాఠశాలతోపాటు ఉర్దూ మీడియం స్కూల్‌కు 6,236.21 గజాలు, రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 3,404 గజాల స్థలం, మున్సిపల్ వాటర్ ట్యాంక్ 2,422.31 ఇప్పటికే కేటాయించారు. తాజాగా వెలువడిన ఉత్తర్వుల ప్రకారం డిగ్రీ కళాశాల కోసం 3,553.28 గజాలు కేటాయింపు జరిగింది. అలాగే డిగ్రీ, జూనియర్ కళాశాల కామన్ క్రీడామైదానం కోసం 5,573.01 గజాలు కేటాయించారు. ప్రస్తుతం కొనసాగుతున్న భవనాలను యథావిధిగా కొనసాగిస్తూ 3,553.28 గజాల విశాలమైన విస్తీర్ణంలో డిగ్రీ కళాశాల నూతన భవనం నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్ మంగళారం ఒక ప్రకటనలో తెలిపారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గోపీ, ఆర్డీఓ (ఫైల్)

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



కాశిబుగ్గ: గుర్తు తెలియని వ్యక్తి రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం రాత్రి చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి 5.6 ఎత్తు, చామన ఛాయ, కోళ ముఖం, బ్లాక్ కలర్ నైట్ ఫ్యాంట్, బూడిద రంగు టీషర్ట్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి నగరంలోని మేఘన బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్‌పై చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి టీ షర్టుపై ఎంఎస్ అని పేరు ఉందని, రెండు బీరువా తాళాలు, ఇంటి తాళం ఉందన్నారు. ఇతర వివరాలు తెలియక పోవడంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిసినచో 94415 57232, 94406,27532 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.